
సాక్షి బాపట్ల

బుధవారం । 11 । డిసెంబర్ । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 583.60 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,144 క్యూసెక్కులు వదిలారు.



జెడ్పీ భూముల పరిశీలన

నాదెండ్ల: గణపవరం గ్రామంలో జెడ్పీ భూములను మంగళవారం ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు. లీజుదారుల అర్జీ మేరకు పరిశీలించినట్లు సమాచారం.



సుస్థిరాభివృద్ధిపై శిక్షణ

అమరావతి: గ్రామాలలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీ ఎస్ఐఆర్డీ మానిటరింగ్ అధికారి కె.మోహన్‌రావు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఇసుక అక్రమ తవ్వకాలపై విజిలెన్స్ దాడులు



అమరావతి: నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలకు విరుద్ధంగా మల్లాది వద్ద కృష్ణా నదీగర్భంలో భారీ యంత్రాలతో సాగిస్తున్న ఇసుక తవ్వకాలపై విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గుంటూరు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ, మైనింగ్ అధికారులతో కూడిన బృందం దాడులు చేసింది. ఇసుక తోడే నాలుగు భారీ యంత్రాలను సీజ్ చేశారు. విజిలెన్స్ సీఐ శివాజీ మాట్లాడుతూ స్వాధీనం చేసుకున్న పొక్లెయిన్‌ను అమరావతి పోలీసులకు అప్పగించామని, క్రిమినల్ కేసుల నమోదు కోసం ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

అంబడిపూడిలో..

అచ్చంపేట: మండలంలోని అంబడిపూడి ఇసుక రీచ్‌లోనూ విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. జేసీబీలు, మూడు లారీలు తదితరాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి డి.సూర్యశ్రావణ్ కుమార్ మాట్లాడుతూ నదీ గర్భంలో ఎలాంటి అనుమతులు లేకుండా భారీ యంత్రాలతో తవ్వకాలు చేపట్టరాదని చెప్పారు. విజిలెన్స్ సీఐలు కె.చంద్రశేఖర్, పి.శివాజీ, మైనింగ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉద్యోగ అవకాశాలు



మంగళగిరి: నగర పరిధిలోని ఏపీఎస్పీ బెటాలియన్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం స్పోర్ట్స్ మీట్ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన బెటాలియన్ కమాండెంట్ బి.రాజకుమారి స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. క్రీడలతో ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. కమాండెంట్ కె.నగేష్, అడిషనల్ కమాండెంట్ డి.ఆశీర్వాదం, ఫైర్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్, ఆక్టోపస్ కమాండెంట్ మాదిరెడ్డి ప్రతాప్ పాల్గొన్నారు.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ పరిధిలోని అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం అదనపు ప్రత్యేక రైళ్లను కేటాయించడం జరిగిందని సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ మంగళవారం వెల్లడించారు. సికింద్రాబాద్–కొల్లం (07175) ప్రత్యేక రైలు ఈ నెల 19, 26 తేదీలలో నడవనుందని తెలిపారు. ఈ రైలు సికింద్రాబాద్ స్టేషన్ నుంచి రాత్రి 8 గంటలకు బయలు దేరి కొల్లం స్టేషన్‌కు రెండో రోజు రాత్రి 1.30 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. కొల్లం–సికింద్రాబాద్(07176) ప్రత్యేక రైలు ఈనెల 21, 28వ తేదీలలో అందుబాటులో ఉంటుదన్నారు. ఈ రైలు కొల్లం స్టేషన్ నుంచి తెల్లవారు జామున 5 గంటలకు బయలు దేరి, మరుసటి రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఈ రైళ్లు ప్రధానంగా మౌలాలి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, వేలూరు, తిరువణ్ణామలై, విల్లుపురం మీదుగా రాకపోకలు సాగిస్తాయని ఆయన తెలిపారు.

'కౌశల్-2024'కు 12 మంది ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లాస్థాయిలో డిసెంబర్ 6న జరిగిన కౌశల్–2024 పోటీల్లో ప్రతిభ చూపిన 12 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులకు, వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ఈ నెల 29, 30వ తేదీల్లో విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు.

విజేతలు వీరే..

కౌశల్–2024 జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో చింతా ఉమిక (జెడ్పీ హైస్కూల్, అబ్బినేని గుంటపాలెం), తోటకూర జ్ఞానదీపిక, బడే అవంతిక అన్నపూర్ణ (జెడ్పీ హైస్కూల్, ముట్లూరు) ప్రథమస్థానంలో.. వడ్డే వెంకట సాయి (జెడ్పీ హైస్కూల్, నల్లపాడు), కొణిదల నందిని (జెడ్పీ హైస్కూల్, కాట్రపాడు), కుక్కమళ్ల ఆదర్శ్ (జెడ్పీ హైస్కూల్, జొన్నలగడ్డ) ద్వితీయ స్థానంలో నిలిచారు. మరికొన్ని విభాగాల్లోనూ విజేతలను ప్రకటించారు.

> సమృద్ధిగా నిధులున్నా పనులు చేయాలనే సంకల్పం లేదు. కొన ఊపిరితో రోగుల ప్రాణాలు కొట్టుమిట్టాడుతున్నా.. కాపాడాలన్న కనికరం లేదు. ఆస్పత్రి నిర్మాణానికి అనువైన పరిస్థితులు ఉన్నా ఆరంభం లేదు. పేదలకు వైద్య సేవలు అందించాలనే చిత్తశుద్ధి అంతకన్నా లేదు.. ఇదీ నరసరావుపేటలో ఏరియా వైద్యశాల ఉన్నతీకరణ, క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణాలపై కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు.



లింగంగుంట్లలోని 200 పడకల వైద్యశాల

హతనిధి!

నిధులున్నా నిర్లక్ష్యమే

- 350 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి నిధులు మంజూరు
- 200 పడకల ఆస్పత్రి నిర్మించి ప్రారంభించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- ఆరు నెలలు దాటినా 150 పడకల ఆస్పత్రి నిర్మాణానికి ముందుకు రాని కూటమి ప్రభుత్వం
- 75 పడకల క్రిటికల్ కేర్ నిర్మాణంలోనూ అదే నిర్లక్ష్యం
- నిర్మాణ స్థలం కోసం వేచిచూస్తున్న ఆరోగ్య శాఖ
- స్థలం కేటాయింపులో తీవ్ర జాప్యం
- ఇబ్బందులు పడుతున్న రోగులు

నరసరావుపేట టౌన్ : అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది నరసరావుపేట ఏరియా ప్రభుత్వ వైద్యశాల పరిస్థితి. పల్నాడు బస్టాండ్ వద్ద ఉన్న ప్రభుత్వ వైద్యశాలను అప్‌గ్రేడ్ చేసి లింగంగుంట్ల వద్ద గల జలవనరుల శాఖకు చెందిన 4.20 ఎకరాల స్థలంలో 350 పడకలతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చర్యలు చేపట్టారు. మొదటి దశలో 200 పడకల ఆస్పత్రి నిర్మాణం పూర్తయింది. రెండో దశలో 150 పడకల ఆస్పత్రి నిర్మాణానికి టెండర్ ప్రక్రియ కూడా చేపట్టారు. రూ.57 కోట్లు నాబార్డు నిధులు మంజూరయ్యాయి. ఎన్నికల కోడ్



పాత వైద్యశాలలో నిరుపయోగంగా ఉన్న అత్యవసర విభాగం

రావటంతో పనులు నిలిచాయి.

సరి'పడక' వెతలు!

ఏరియా వైద్యశాలలో నిత్యం సుమారు 1,000 నుంచి 1,200 వరకు ఓపీ నమోదవుతోంది. ఇన్‌పేషెంట్లుగా మరో 200 మంది వరకు వైద్య సేవలు పొందుతున్నారు. దీంతో 200 పడకల వైద్యశాల సరిపోవటం లేదు. సీజనల్ వ్యాధులు ప్రబలిన సమయంలో ఒక్కో బెడ్‌పై ఇద్దరికి చికిత్స అందించాల్సిన దుస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 150 పడకల ఆస్పత్రి నిర్మాణంపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. దీంతోపాటు ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రా మిషన్ ద్వారా మంజూరైన క్రిటికల్ కేర్ బ్లాక్ (సీసీబీ)నిర్మాణంపైనా దృష్టి పెట్టడం లేదు. సీసీబీకి రూ.36.35 కోట్లు మంజూరయ్యాయి. దీనికి టెండర్ పిలవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించడంతో ఆ ప్రక్రియ సాగుతోంది.

స్థలం కోసం కలెక్టర్‌కు నివేదిక

200 పడకల ఆస్పత్రికి అనుబంధంగా మరో 150 పడకల ఆస్పత్రి నిర్మాణానికి స్థలం కేటాయించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కలెక్టర్ అరుణ్ బాబును కోరారు. లింగంగుంట్లలోని వైద్యశాల పక్కనే నిర్మాణం చేపట్టాలని మొదట భావించారు. అయితే ఆ స్థలం తమకు కేటాయించాలని పోలీస్ శాఖ అడగడంతో మరో ప్రాంతంలో స్థలం మంజూరు చేయాలని వైద్యాధికారులు కోరారు.

అనువుగా పాత వైద్యశాల ప్రాంగణం

150 పడకల వైద్యశాలతోపాటు సీసీబీ బ్లాక్ నిర్మాణానికి పల్నాడు రోడ్డులోని పాత వైద్యశాలలో పలు భవనాలు అనువుగా ఉన్నాయి. నిరుపయోగంగా ఉన్న వీటిని పడగొట్టి వాటి స్థానంలో కొత్త 150 పడకల వైద్యశాల, సీసీబీ బ్లాక్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని వైద్యాధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ రెండు బ్లాక్‌లను వేర్వేరు చోట్ల నిర్మిస్తే అత్యవసర వైద్యం అందించాల్సిన సమయంలో రోగుల తరలింపు ఇబ్బందితో కూడుకున్నదని చెప్పారు. దీంతో జాయింట్ కలెక్టర్ రెండు నెలల క్రితం పాత ఏరియా వైద్యశాల ప్రాంతాన్ని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఇదిలా ఉంటే 150 పడకల వైద్యశాల, సీసీబీ బ్లాక్‌ల నిర్మాణంపై కూటమి ప్రభుత్వంగానీ, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు కానీ చొరవ చూపడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు దాటినా దీనిపై కనీస చర్యలు చేపట్టడం లేదన్న ఆవేదన వ్యక్తమవుతోంది.

అనుమతులు రాగానే నిర్మాణం ప్రారంభం

75 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తాం. పాత వైద్యశాలలో నిరుపయోగంగా ఉన్న భవనాల స్థానంలో వాటిని నిర్మించేందుకు చర్యలు చేపట్టాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులు చేపడతాం. 150 పడకల వైద్యశాల కోసమూ స్థలం కేటాయించాలని కలెక్టర్‌ను కోరాం.



\- డాక్టర్ మంత్రూనాయక్, నరసరావుపేట ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్

గ్రామాల పరిశుభ్రతతోనే అభివృద్ధి

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కళ్యాణ చక్రవర్తికి జ్ఞాపిక బహూకరిస్తున్న హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల, అభివృద్ధి సాధ్యమవుతుందని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవ ముగింపు కార్యక్రమం మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. గ్రామీణ నీటి సరఫరా పారిశుద్ధ్య విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.కళ్యాణ చక్రవర్తి అధ్యక్షత వహించిన సభలో హెనీ క్రిస్టినా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగ్గా ఉందని, ఈ మార్పు ఇదేవిధంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరముందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్లాప్ మిత్ర సిబ్బందిని శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. జిల్లాస్థాయిలో వ్యక్తిగత మరుగుదొడ్ల సుందరీకరణ, వినియోగాన్ని ప్రోత్సహించడంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రత్తిపాడు మండలం గనికపూడి గ్రామ పంచాయతీ తరఫున సర్పంచ్ కె.తులశమ్మ జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. జెడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు, జిల్లా పంచాయతీ అధికారి బీవీఎస్ సాయికుమార్, గృహ నిర్మాణశాఖ పీడీ జేవీఎస్ఆర్‌వీ ప్రసాద్, స్వచ్ఛ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అర్జునరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా సమన్వయకర్తలు షేక్ షఫీ, జి.సాయికుమార్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

పర్చూరు (చినగంజాం): రైతులకు భూమి తల్లిలాంటిదని.. గ్రామాల్లో భూ సమస్యలు లేకుండా చేయడమే రెవెన్యూ సదస్సుల ముఖ్య లక్ష్యమని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా పేర్కొన్నారు. బాపట్ల జిల్లా పర్చూరు మండలం తన్నీరువారిపాలెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ... డిసెంబరు 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు రాష్ట్రంలో 473 రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. భూ సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు. రైతులు అడిగిన 1–బీ, అడంగల్ తదితర ధ్రువీకరణ పత్రాలకు ఎలాంటి రుసుం తీసుకోబోమన్నారు. రైతుల అన్ని భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ముందుగా జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి మాట్లాడుతూ సదస్సులలో రెవెన్యూకు సంబంధం లేని అర్జీలను కూడా స్వీకరించి ఆయా శాఖలకు పంపించాలన్నారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తన్నీరువారిపాలెంలో రైతుల నుంచి వచ్చిన అర్జీలకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఆళ్ల వెంకటరావు, జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న, జిల్లా పంచాయతీ అధికారి కేఎల్ ప్రభాకర్ రావు, జిల్లా వైద్యాధికారి విజయమ్మ, బాపట్ల ఆర్డీవో గ్లోరియా, మండల ప్రత్యేకాధికారి శ్యాంసన్, తహసీల్దార్ బ్రహ్మయ్య, డీటీ అరుణ, ఆర్ఐ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఆర్పీ సిసోడియా, జె.వెంకట మురళి

కలెక్టరేట్ భవనానికి స్థల పరిశీలన

బాపట్ల: రెవెన్యూ సదస్సులో పాల్గొనేందుకు జిల్లాకు చేరుకున్న రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియాను జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించారు. అనంతరం బాపట్లలోని కలెక్టరేట్ భవనాన్ని, నూతన కలెక్టరేట్ భవనానికి ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు.

హనుమంతుడి నుంచి ఎన్నో జీవిత పాఠాలు

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు
- హనుమత్ వైభవంపై ప్రవచనాలు ప్రారంభం



ప్రవచిస్తున్న చాగంటి

చీరాల అర్బన్: హనుమంతుడి నుంచి మనం నేర్చుకోవాల్సిన జీవిత పాఠాలు ఎన్నో ఉన్నాయని ప్రభుత్వ సలహాదారు, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ఎన్ఆర్‌పీఎం హైస్కూల్ గ్రౌండ్‌లో స్థానిక పాపరాజుతోటలోని వీరాంజనేయస్వామి దేవాలయం ఆధ్వర్యంలో హనుమత్ వైభవంపై రెండు రోజులు ఆధ్యాత్మిక ప్రవచనాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ప్రవచనంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. హనుమంతుడంటే ధైర్యానికి మారు పేరని, అందుకే ఎన్నో గొప్ప గుణాలు కలిగిన హనుమాన్ నుంచి మనం నేర్చుకోవాల్సిన జీవిత పాఠాలు ఎన్నో ఉన్నాయన్నారు. హనుమంతుడు సముద్రాన్ని దాటి లంకకు చేరుకున్నాడని, అంతటి గొప్పకార్యం ఆయన ద్వారానే సాధ్యం అవుతుందన్నారు. దీని ద్వారా అతని ఓర్పు, నిలకడ స్వభావాన్ని తెలుసుకోవచ్చన్నారు. తనకు ఇచ్చిన బాధ్యతను నెరవేర్చడానికి ఎన్ని కష్టాలనైనా ఓర్పుతో ఓర్చుకునే గొప్ప లక్షణం హనుమంతుడికి ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సతీసమేతంగా పాల్గొని, చాగంటిని సన్మానించారు. చీరాల పరిసర ప్రాంతాల నుంచి భారీ ఎత్తున ప్రజలు హాజరయ్యారు. ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దేవాలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.



కార్యక్రమానికి హాజరైన స్థానికులు

యార్డుకు 51,699 బస్తాల మిర్చి రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 51,699 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 48,739 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.7,500 నుంచి రూ.13,500 వరకు లభించింది. ఇంకా 40,624 బస్తాల మిర్చి నిల్వ ఉన్నాయి.

13న 'అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ'

- రైతులను నట్టేట ముంచిన కూటమి ప్రభుత్వం
- రాష్ట్ర సర్కారు తీరుపై 13న నిరసన
- పెట్టుబడి సాయం లేక విలవిల్లాడుతున్న రైతులు
- గిట్టుబాటు ధర లేక ధాన్యం విక్రయించలేని దుస్థితి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున
- కార్యక్రమానికి భారీగా తరలి రావాలని పిలుపు



'అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ' గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న మేరుగ నాగార్జున తదితరులు

బాపట్ల: అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని ఈ నెల 13వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంపై నిరసన గళం వినిపించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఒక పక్కన పెట్టుబడి సాయం అందక.. మరో పక్కన పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లేకపోవటంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారని చెప్పారు. వారికి న్యాయం చేసేందుకు జిల్లా కేంద్రంలో రైతులతో ప్రదర్శన చేపడతామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందుకు నిర్ణయం తీసుకున్నామని మేరుగ తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిరసన కార్యక్రమం గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. అన్నం పెట్టే రైతులను నట్టేట ముంచిన కూటమి ప్రభుత్వం ఇప్పట్లో వారు కోలుకోలేని విధంగా దెబ్బ కొట్టిందని పేర్కొన్నారు. వ్యవసాయం దండగ అని చెప్పిన సీఎం చంద్రబాబు నాయుడు మాటకు భిన్నంగా సాగు అంటే పండుగగా చేసి చూపి మహానేత డాక్టరు వైఎస్ రాజశేఖరరెడ్డి అడుగుజాడల్లో ఆయన తనయుడు వైఎస్ జగన్ రైతు పక్షపాతిగా వ్యవహరించారని చెప్పారు. నాటిన విత్తనం దగ్గర నుంచి ధాన్యం కొనుగోలు వరకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక జాగ్రత్తలు తీసుకుని రైతులకు మేలు చేసిన విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. పెట్టుబడి సాయంగా ప్రతి రైతుకు వ్యవసాయ పనులకు ముందే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా ఇచ్చిన పాపాన పోలేదన్నారు. తక్షణమే రైతుకు పెట్టుబడి సాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాలన్నారు. ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాలని పేర్కొన్నారు. దళారీ వ్యవస్థను తొలగించాలని, తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. తేమ లెక్కలతో రైతులను ఇబ్బంది పెట్టడం మానుకోవాలని కోరారు. ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని, రైతుపై అదనపు భారం మోపే చర్యలను మానుకోవాలని డిమాండ్ చేశారు.

పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభం కానున్న ప్రదర్శన

పార్టీలకు అతీతంగా రైతులకు మద్దతుగా చేపట్టిన ఈ కార్యక్రమానికి జిల్లాలోని అన్ని ప్రాంతాల వారు భారీగా పాల్గొనాలని మేరుగ నాగార్జున పిలుపునిచ్చారు. 13వ తేదీ ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు. అక్కడి నుంచి ప్రదర్శనగా జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లనున్నట్లు నాగార్జున తెలిపారు. రైతులకు అండగా నిలివాల్సిన విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే ప్రధాన అజెండాగా ముందుకు సాగుతున్నట్లు నాగార్జున తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధాకర్‌బాబు, కోకి రాఘవరెడ్డి, గవిని కృష్ణమూర్తి, వడ్డిముక్కల డేవిడ్, కొక్కిలిగడ్డ చెంచయ్య, చిన్నపోతుల హరిబాబు, నాగేశ్వరరెడ్డి, ఏడుకొండలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసులు

నెహ్రూనగర్: గుంటూరు కార్పొరేషన్ పరిధిలోని గోరంట్ల ప్రాంతంలో ఆదివారం జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో నగర మేయర్‌ను ఆహ్వానించకపోవడం, శిలాఫలకంలో కూడా ఆయన పేరును చివరిన వేసి అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘించిన వైనంపై 'అధికార 'పచ్చ'మే' శీర్షికన ఈనెల 9న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ప్రొటోకాల్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు, వివరణ ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులుకు మేయర్ లేఖ రాశారు. మేయర్ రాసిన లేఖకు నగర కమిషనర్ స్పందించారు. ప్రొటోకాల్ ఉల్లంఘించిన ఇంజినీరింగ్ అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఇంజినీరింగ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 1902 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 64, తూర్పు కెనాల్‌కు 86, పశ్చిమ కెనాల్‌కు 54, నిజాంపట్నం కాలువకు 126, కొమ్మమూరు కాలువకు 1611 క్యూసెక్కులు వదిలారు.

ఆధునిక దేవాలయం నాగార్జున సాగర్

సాగర్ ప్రాజెక్టు గేట్స్ డీఈ మురళీధర్

విజయపురిసౌత్: ఆధునిక దేవాలయం నాగార్జున సాగర్ ప్రాజెక్టు అని సాగర్ ప్రాజెక్టు గేట్స్ డీఈ మురళీధర్ అన్నారు.మంగళవారం నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ శంకుస్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయపురిసౌత్‌లోని ప్రాజెక్టు ముఖ ద్వారం శంకుస్థాపన పిల్లర్, ఫౌండేషన్ స్టోన్ వద్ద నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి అధికారులు నివాళులర్పించారు.అనంతరం డీఈ మురళీధర్ మాట్లాడుతూ నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి ఆనాటి దేశ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పునాది రాయి డిసెంబర్ 10, 1955లో వేశారన్నారు. ఆనాటి డ్యాం నిర్మాణానికి శ్రమించిన కార్మికులను అందరం గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని సుమారు 22 లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు, 960 మెగావాట్ల విద్యుత్‌ను అందిస్తూ సాగర్ ప్రాజెక్ట్ ఆంధ్ర ప్రదేశ్ అన్నపూర్ణగా మన్నలను పొందుతుందన్నారు. కార్యక్రమంలో విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ, సీఆర్పీఎఫ్ సీఐ ఖలీల్,స్థానిక టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, ఏఈఈలు వెంకట సుబ్బయ్య, హిమబిందు, అనిత శ్రీ, భారతి, ఏఎస్ఐ సోమలా నాయక్, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు మైలపల్లి అప్పలరాజు, వినయ తుల్లా,పులుసు వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విజయపురిసౌత్‌లో సాగర్ ప్రాజెక్టు శంకుస్థాపన పిల్లర్ వద్ద మాట్లాడుతున్న డీఈ మురళీధర్

క్లుప్తంగా

రాష్ట్ర క్యారమ్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



గుంటూరు వెస్ట్(క్రీడలు): చిత్తూరులో ఇటీవల ముగిసిన ఆంధ్ర రాష్ట్ర 3వ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఆంధ్రా క్యారమ్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో వెటరన్ మహిళల విభాగంలో కెజియా జవహర్‌కు బంగారు, వెటరన్ పురుషుల్లో వి.వెంకటేశ్వర్లుకు రజతం, పాల్ సుధాకర్‌కు కాంస్యం, పురుషుల విభాగంలో జి.జయకుమార్‌కు కాంస్య పతకాలు దక్కాయన్నారు. విజేతలను ఆంధ్రా క్యారమ్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డీఆర్ నీరజ్ కుమార్ సంపతి, చీఫ్ ప్యాట్రన్ యాగంటి దుర్గారావులతోపాటు జిల్లా కమిటీ సభ్యులు అభినందించారని పేర్కొన్నారు.

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తాం

గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి



తాడేపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతు సేవా కేంద్రాల ద్వారా నియమ నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని గుంటూరు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం దుగ్గిరాల గ్రామంలో ఏఓ శిరీషతో కలిసి ఆయన పర్యటించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. ధాన్యం నింపేందుకు గోతాలు, రవాణాకు వాహనాలు రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చామని వెల్లడించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన అన్నారు. ఏఈఓలు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్ పోటీల్లో జెస్సీరాజ్‌కు రజతం



మంగళగిరి: రోలర్ స్కేటింగ్ 62వ జాతీయ చాంపియన్ షిప్ పోటీల్లో మంగళగిరికి చెందిన క్రీడాకారిణి మాత్రపు జెస్సీరాజ్ సత్తా చాటి రజత పతకం సాధించింది. తమిళనాడు రాష్ట్రం పొలాచి నగరంలోని కేశవ విద్యామందిర్ స్కేటింగ్ పార్క్‌లో స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 10 వ తేదీ వరకు పోటీలు జరిగాయి. జెస్సీరాజ్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించి రజత పతకం సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా పలువురు జెస్సీరాజ్‌కు అభినందనలు తెలిపారు.

చిన్నారుల హక్కుల పరిరక్షణే ధ్యేయం

- రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి
- చినగంజాంలోని విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీ



పాఠశాల విద్యార్థులు, సిబ్బందితో కలిసి భోజనం చేస్తున్న దృశ్యం

చినగంజాం: బాలల హక్కులను పరిరక్షించడమే ధ్యేయంగా వ్యవస్థలన్నీ చిత్తశుద్ధితో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి సూచించారు. మండల ప్రధాన కేంద్రం చినగంజాం తదితర చోట్ల ఆమె మంగళవారం విద్యాసంస్థలను, అంగన్‌వాడీ కేంద్రాలను, సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కడవకుదురు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. పలు రిజిస్టర్‌లు, స్టాక్, ఆహార పదార్థాలను ఆమె పరిశీలించి, సిబ్బందికి వివిధ సూచనలిచ్చారు. అనంతరం చినగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల హాజరు తీరు, రిజిస్టర్‌లను పరిశీలించారు. 20 శాతానికిపైగా డ్రాప్ అవుట్స్ ఉన్నారని, 30 శాతానికిపైగా రెగ్యులర్‌గా గైర్హాజర వుతున్నారని గుర్తించారు.

హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసులు ఇవ్వండి..

పాఠశాలలోని స్టాక్ రూంలో కోడిగుడ్లు, చిక్కి, రాగి పిండి అధిక మొత్తంలో నిల్వ ఉన్నాయని, విద్యార్థులకు సకాలంలో అందించడం లేదని గుర్తించారు. పాఠశాల నిర్వహణ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు, ఎంఈఓ కోటేశ్వరరావులతో మాట్లాడారు. హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని, ప్రతి ఉన్నత పాఠశాలలో బాలల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని పద్మావతి సూచించారు. సచివాలయ మహిళా పోలీస్, వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు పాఠశాలలోని బాలికలకు జరిగిన బాల్యవివాహాలపై ఉన్నతాధికారులకు సమాచారం తెలియజేయక పోవడంపై ఎంపీడీఓ ద్వారా మెమో జారీ చేయాలని ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థులతో ఆమె స్వయంగా మాట్లాడారు. వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆర్వో ప్లాంట్‌ను, స్కూల్ రికార్డ్స్‌ను పరిశీలించారు. ఫిర్యాదుల బాక్స్‌ను అందుబాటులో ఉంచాలని, దానిని మహిళా పోలీస్, ఎంఈఓ పరిశీలన చేస్తూ ఉండాలని సూచించారు. అనంతరం చినగంజాం ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని, మూడు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ప్రాథమిక పాఠశాలలో ఎంపీడీఓ శ్రీనివాసమూర్తికి పలు సూచనలు చేశారు. ప్రాంగణంలో పిచ్చి మొక్కలు పెరగడంతో పాఠశాల హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే చర్యలు తీసుకోకుంటే ఉపేక్షించేది లేదని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావుకు ఆదేశాలిచ్చారు. గ్రామ సచివాలయాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శీలం రమేష్, జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం డి. రత్నకుమారి, ఎంఈఓ కోటేశ్వరరావు, సీడీపీఓ టి. ఝాన్సీ, సూపర్‌వైజర్‌లు వాణిశ్రీ, సుమలత, జిల్లా బాలల హక్కుల సంరక్షణాధికారి పురుషోత్తమరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ రవిచంద్ర, మహిళా పోలీస్ నాయుడు మీనాక్షి, సీఆర్పీ సురేంద్ర పాల్గొన్నారు.



చినగంజాంలో రికార్డులను పరిశీలిస్తున్న బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి

లైంగిక దాడి కేసులో నిందితుడు అరెస్ట్

- మహిళపై ఉద్దేశపూర్వకంగానే లైంగిక దాడి
- కేసు నమోదులో ఎటువంటి అలసత్వం లేదు
- నార్త్‌జోన్ డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ



లైంగికదాడి కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కొత్తూరులో నివాసముండే ఓ మహిళపై ఉద్దేశపూర్వకంగానే యువకుడు లైంగిక దాడి చేశాడని, నిందితుడు చెబుతున్నట్లుగా క్షణికావేశంలో జరిగింది కాదని నార్త్‌జోన్ డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ట్రైనింగ్ డీఎస్పీ భార్గవి, తాడేపల్లి సీఐ కల్యాణ్ రాజులతో కలసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ.. ఆదివారం అర్ధరాత్రి తాడేపల్లి పట్టణానికి చెందిన తెంపర్ల రామారావు తన స్నేహితుడి తల్లిపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్నారు. కొన్ని సంవత్సరాల నుంచి బాధితురాలి కుమారుడికి, రామారావుకు మధ్య స్నేహం ఉందన్నారు. తన స్నేహితుడు ఇంట్లో లేని విషయం తెలుసుకున్న రామారావు అతని తల్లిపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్నారు. ఈ కేసులో పోలీసులు ఎటువంటి జాప్యం చేయలేదని, ఆ మహిళ సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని చెప్పారు. వెంటనే గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు జరిగిన సంఘటన వివరాలు తెలియజేశామని వివరించారు. తర్వాత బాధిత మహిళ ఇంటికి వెళ్లి ఆధారాలు సేకరించినట్లు వెల్లడించారు. అనంతరం కేసు కూడా నమోదు చేశామని తెలిపారు. బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని పేర్కొన్నారు. నిందితుడు రామారావును రెండు గంటల వ్యవధిలో అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఈ కేసులో వివరాలు సేకరించేందుకు తాడేపల్లి సీఐ కళ్యాణ్ రాజు, ట్రైనింగ్ డీఎస్పీ భార్గవి, ఇతర సిబ్బంది ఎంతో శ్రమించారని ఆయన అన్నారు.

జాతీయస్థాయి ఈత పోటీలకు ఎస్ఎస్ఎన్ విద్యార్థి



వై.మధుకిషోర్

నరసరావుపేట ఈస్ట్: జాతీయ స్థాయి స్విమ్మింగ్ (ఈత) పోటీలకు శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థి వై.మధు కిషోర్ ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదనరావు మంగళవారం తెలిపారు. విశాఖలోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈనెల 7,8 తేదీలలో నిర్వహించిన 9వ రాష్ట్రస్థాయి శీతాకాలపు సబ్‌జూనియర్, జూనియర్ అంతర్ జిల్లాల బాలబాలికల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో మధుకిషోర్ 200 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని వివరించారు. ఈనెల 28వ తేదీన విజయవాడలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో మధుకిషోర్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. కళాశాల పాలకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, అధ్యాపకులు అభినందించారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఇసుక దర్శి విద్యార్థి



మార్టూరు: జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఇసుక దర్శి గ్రామానికి చెందిన విద్యార్థి ఎంపికయ్యాడు. ఈ నెల 9వ తేదీన పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గ్రామానికి చెందిన 11 సంవత్సరాల విద్యార్థి కర్పూరపు హితేష్ మొదటి బహుమతి సాధించాడు. తద్వారా జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. హితేష్ ఒంగోలు కేంద్రీయ విద్యాలయంలో ఆరో తరగతి చదువుతున్నాడు. బాలుడిని ప్రిన్సిపల్ మనీష్ కుమార్, గురువు వెంకటేష్, తల్లిదండ్రులు కర్పూరపు శివపార్వతి, అనిల్ కుమార్, స్థానికులు అభినందించారు.

ట్రాక్టర్ల ఇసుక దందా

నరసరావుపేట: ట్రాక్టర్లకు ఉచిత ఇసుక అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారింది. చోటామోటా టీడీపీ నేతలు జిల్లాలోని పలు రీచ్‌ల నుంచి ట్రాక్టర్లతో ఇసుకను తీసుకొచ్చి నరసరావుపేట పట్టణంలో అధిక ధరకు విక్రయిస్తున్నారు. నరసరావుపేటలోని సత్తెనపల్లి రోడ్డులో ఇసుక ట్రాక్టర్లు బారులు తీరి కనిపించడం దీనికి నిదర్శనం. ట్రాక్టర్ ఇసుకను రూ.5వేల నుంచి రూ.6వేలకు విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. పట్టణంలోని ఇసుక, ఇతర బిల్డింగ్ మెటీరియల్ విక్రయించే మారుబేరగాళ్లకు అధికంగా సరఫరా చేస్తున్నారు. గృహ నిర్మాణదారులకు మాత్రం ఇసుక టన్ను రూ.1,500 తక్కువకు లభించడం లేదు.

ముగిసిన ఇంటర్ కాలేజ్ వాలీబాల్ టోర్నమెంట్

– ట్రోఫీ కైవసం చేసుకున్న కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు

గుంటూరు రూరల్: క్రీడా రంగంలో భారతదేశ కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో చాటే విధంగా క్రీడాకారులు తయారవ్వాలని, ఓటమిని గెలుపునకు సోపానాలుగా మలుచుకోవాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని తెలిపారు. గత రెండు రోజులుగా మండలంలోని చౌడవరం గ్రామంలోగల కళాశాలలో జరుగుతున్న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంటర్ కళాశాలల వాలీబాల్ మెన్స్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. టోర్నమెంట్‌లో ఫైనల్స్‌కి చేరిన నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు, బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల జట్ల మధ్య సాగిన పోటీలో ఇరు జట్ల క్రీడాకారులు ఆటలో వారి మెలకువలను ప్రదర్శిస్తూ సమాన పాయింట్స్ సాధిస్తూ ఉత్కంఠ భరితంగా ఆడారు. కృష్ణవేణి జట్టు మొదటి స్థానంలో నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల జట్టు రెండో స్థానంలో నిలిచి రన్నరప్ ట్రోఫీని సొంతం చేసుకుంది. తృతీయ స్థానంలో ఏఎన్‌యూ కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్టు, నాల్గో స్థానంలో ధనలక్ష్మి కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్టు నిలిచాయి. టోర్నమెంట్‌లో ఉత్తమ నైపుణ్యాన్ని కనబరిచిన క్రీడాకారులను ఏఎన్‌యూ వాలీబాల్ (మెన్) జట్టుకి ఎంపిక చేశారు. ఎన్నికైన క్రీడాకారులు ఈనెల కేరళ యూనివర్సిటీలో జరగనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీస్ వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొననున్నట్లు ఏఎన్‌యూ అబ్జర్వర్స్, సెలక్షన్ కమిటీ సభ్యులు ప్రకటించారు. కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వీ శ్రీనివాసరావు, ఏఎన్‌యూ టోర్నమెంట్ అబ్జర్వర్ డాక్టర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

24 గంటల్లోనే బాలిక మిస్సింగ్ కేసు ఛేదన

విజయపురిసౌత్: విజయపురిసౌత్ పోలీసులు 24 గంటల వ్యవధిలోనే మిస్సింగ్ కేసును ఛేదించారు. వివరాల్లోకి వెళితే మాచర్ల మండలం చింతల తండా గ్రామానికి చెందిన బాలిక జటావత్ విజయమ్మ గత సోమవారం అర్ధరాత్రి ఇంటిలో కనిపించకపోవడంతో బాలిక తల్లిదండ్రులు విజయపురి సౌత్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ షేక్ మహమ్మద్ షఫీ మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు బృందాలుగా బాలిక కోసం పలు ప్రాంతాల్లో గాలించారు. తెలంగాణ ప్రాంతంలో బాలిక ఆచూకీ కనుక్కొన్నారు. అనంతరం బాలికను తీసుకొచ్చి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించారు. 24 గంటల్లోపే బాలిక ఆచూకీ కనిపెట్టడంతో ఎస్‌ఐ షేక్ మహమ్మద్ షఫీ, ఏఎస్‌ఐలు సోమలా నాయక్, సోమయ్య, పోలీస్ సిబ్బందిని స్థానికులు అభినందించారు.

సాగర్ జలాశయంలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం



విజయపురిసౌత్: మాచర్ల మండలం నాగార్జున సాగర్ కృష్ణా జలాశయంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన మంగళవారం జరిగింది. విజయపురిసౌత్ ఎస్‌ఐ షేక్ మహమ్మద్ షఫీ కథనం ప్రకారం విజయపురిసౌత్‌లోని మేకల గొంది సమీపం లోని కృష్ణా జలాశయం వద్ద ఓ వ్యక్తి మృతదేహం కనిపించడంతో పొలాలకు వెళ్తున్న రైతులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ మహమ్మద్ షఫీ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రధానోపాధ్యాయురాలి హఠాన్మరణం

విధుల్లో ఉండగా అస్వస్థత



భార్గవి (ఫైల్)

దుర్గి: కంచరగుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న పి.భార్గవి (30) సోమవారం రాత్రి హఠాన్మరణం చెందారు. కంచరగుంట పాఠశాలలో సోమవారం విధులు నిర్వహిస్తున్న సమయంలో భార్గవి అస్వస్థతకు గురయ్యారు. నీరసంగా ఉండడంతో తోటి ఉపాధ్యాయులకు చెప్పి దుర్గిలో నివసిస్తున్న తన ఇంటికి చేరుకున్నారు. అకస్మాత్తుగా గుండెనొప్పి రావటంతో కారులో మాచర్ల వైద్యశాలకు తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు బంధువులకు తెలిపారు. గతంలో ముటుకూరు, ఆత్మకూరు ప్రాథమిక పాఠశాలలో ఆమె పనిచేశారు. విషయం తెలుసుకున్న ఎస్టీయూ నాయకులు, తోటి ఉపాధ్యాయులు భార్గవి మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. మంగళవారం పిడుగురాళ్ళ మండలంలోని జానపాడు గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలి



ధర్నా చేస్తున్న నాయకులు

నరసరావుపేట: పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఐక్య (ఎంసీపీఐయూ) పల్నాడు జిల్లా కార్యదర్శి రెడ్ బాషా డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆర్డీఓ కార్యాలయం ఎదుట మంగళవారం ఎంసీపీఐయూ, ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ (ఏఐకేఎఫ్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రెడ్ బాషా మాట్లాడుతూ సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై మోపిన భారాన్ని, స్మార్ట్ మీటర్ల ప్రతిపాదనలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో కార్యాలయంలో అందజేశారు. ఏఐకేఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శి తూమాటి మణి కంఠేశ్వరరావు, పట్టణ నాయకులు మహబూబ్ బాషా, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు షేక్ సైదా, ఓల్డ్ గన్ని వర్కర్స్ యూనియన్ నేత గుంటూరు బాజీ పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

- రెండు కుటుంబాలకు రూ.2 లక్షల ఆర్థిక సహాయం
- అందజేసిన పల్నాడు అదనపు ఎస్పీ సంతోష్, అధికారులు



నరసరావుపేట: నిరంతరం ప్రజా రక్షణ కోసం పాటుపడే పోలీస్ సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటామని పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ జేవీ సంతోష్ పేర్కొన్నారు. ఇటీవల మృతి చెందిన ఇద్దరి పోలీసు కుటుంబాలకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో రూ. 2 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ ఏడాది అక్టోబరులో ఏఆర్ విభాగంలో పని చేస్తూ గుండెపోటుతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ ఎస్.వెంకటేశ్వర్లు భార్య యల్లమ్మకు పోలీసు అసోసియేషన్ తరఫున రూ. లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. అదే నెల 30న గుండెపోటుతో మరణించిన పిడుగురాళ్ల పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సందేపోగు శ్యామ్ ప్రసాద్ భార్య నిర్మలాదేవికి మరో రూ.లక్ష చెక్కును అందజేశారు. ఏఆర్ అదనపు ఎస్పీ సత్తిరాజు, ఏఏవో కేవీడీ రామారావు, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టి.మాణిక్యాలరావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ఏపీ బాలికల సత్తా



అక్షితను అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం సుగంధరావు

యద్దనపూడి: జాతీయస్థాయి బాలికల షూటింగ్ బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు ఘన విజయం సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. ఈనెల 7 8 9వ తేదీలలో అనంతపురం జిల్లా నార్పాలలోని నేతాజీ జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన 43వ జాతీయస్థాయి షూటింగ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో మహారాష్ట్ర జట్టుపై ఏపీ బాలికల జట్టు అత్యుత్తమ ప్రతిభను చాటి చాంపియన్‌షిప్‌ని కైవసం చేసుకుంది. స్టేట్ టీం సెలక్షన్‌కు కారుచోల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు పాల్గొనగా వారిలో తొమ్మిదో తరగతి విద్యార్థిని లుక్క అక్షిత రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించింది. పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన అక్షితను, బాలికకు శిక్షణ ఇచ్చిన పాఠశాల పీడీ రమాదేవి బాయిలను మంగళవారం పాఠశాలలో అభినందించారు. అభినందించిన వారిలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామ పెద్దలు ఉన్నారు.

నాణ్యమైన పంటల ఉత్పత్తిపై దృష్టి సారించాలి



రైతులకు సూచనలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి వి.రమణారెడ్డి

నకరికల్లు: రైతులు నీటివనరులు సద్వినియోగం చేసుకోవడంతోపాటు తక్కువ నీటి వినియోగం, తక్కువ పురుగుమందుల వినియోగంతో నాణ్యమైన ఉత్పత్తులు సాధించేందుకు రైతులు దృష్టి సారించాలని జిల్లా ఉద్యానవన అధికారి వి.రమణారెడ్డి అన్నారు. ఇండో-ఇజ్రాయిల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ వెజిటబుల్స్ అండ్ స్పైసెస్‌కు అనుసంధానమైన చేజర్ల, కుంకలగుంట గ్రామాల్లోని మిర్చి రైతులకు రైతుసేవా కేంద్రాల్లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యానవన పంటలలో పాటించాల్సిన మెళకువలు, సాగులో ఆదాయాన్ని పెంచుకోవడంపై అవగాహన కల్పించారు. ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు కల్పించే రాయితీలను పొందాలని సూచించారు. ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ ఎ.రాధికారమ్య మాట్లాడుతూ మిరపలో రైతులు సమగ్ర యాజమాన్యం, సమగ్ర పోషకయాజమాన్యం పాటించాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై అవగాహన పెంచుకొని పంటపై ప్రభావం చూపకుండా చర్యలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయిల్‌ఫాం సాగు లాభదాయకంగా ఉంటుందని, రైతులు ఆ వైపు దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి దాసరి నవీన్‌కుమార్, గ్రామ ఉద్యానవన సహాయకులు పులి సాయివెంకట్, వర్ల వంశీ, కె.వెంకటకృష్ణ, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సౌత్ ఇండియా టెన్నిస్ టోర్నీలో పల్నాడు చిన్నారి ప్రతిభ



సూక్తిశ్రీకి షీల్డు అందజేసి, అభినందిస్తున్న నిర్వాహకులు

నరసరావుపేట: విశాఖపట్నం నగర పరిధిలోని మధురవాడ సాయి ప్రియా లే అవుట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లే అవుట్ గృహ సముదాయంలో ఆదివారం నిర్వహించిన సౌత్ ఇండియా జూనియర్ హార్డ్ టెన్నిస్ చాంపియన్ షిప్ పోటీలో నరసరావుపేట పట్టణానికి చెందిన పి.సూక్తిశ్రీ అండర్-10 విభాగంలో ప్రతిభ చాటి విన్నర్‌గా నిలిచిందని కోచ్ బి.బాబునాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి అండర్-9 నుంచి అండర్-14 విభాగాల్లో 80 మంది బాలబాలికలు పాల్గొనగా, అందులో సూక్తిశ్రీ ప్రతిభ చాటి విన్నర్‌గా నిలిచిందని పేర్కొన్నారు. పట్టణానికి చెందిన డాక్టర్ పి.శ్రీనివాస్, డాక్టర్ సురేఖ దంపతుల కుమార్తె సూక్తిశ్రీ ప్రకాష్‌నగర్‌లోని సీబీఐటీ స్కూలులో ఆరో తరగతి చదువుతూ గత నాలుగేళ్లుగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వెనుకవైపు గల ఆపీసర్స్ క్లబ్ ప్రాంగణంలో కోచ్ బుక్యా బాబూనాయక్ వద్ద శిక్షణ పొందుతోంది. తండ్రి డాక్టర్ శ్రీనివాస్ ప్రోత్సాహంతో రాష్ట్ర స్థాయిలో జరిగిన టెన్నిస్ పోటీలకు హాజరైంది. సీబీఐటీ స్కూల్ డైరెక్టర్ యోగిరెడ్డి, ఉపాధ్యాయులు, పట్టణ ప్రముఖులు సూక్తిశ్రీని అభినందించారు.

నాణ్యమైన విద్యుత్ ప్రజలకు అందించాలి

విద్యుత్ శాఖ పల్నాడు జిల్లా ఎస్ఈ ప్రత్తిపాటి విజయ్‌కుమార్



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

పిడుగురాళ్ల: గృహవాసులకు నాణ్యమైన విద్యుత్ అందించాల్సిన బాధ్యత విద్యుత్ శాఖ అధికారులపై ఉందని ఆ శాఖ ఎస్ఈ డాక్టర్ ప్రత్తిపాటి విజయ్‌కుమార్ చెప్పారు. పట్టణంలోని కొండమోడు సమీపంలో ఉన్న విద్యుత్ శాఖ సబ్ డివిజన్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. విద్యుత్ బిల్లుల వసూళ్ల విషయంలో అధికారులు అశ్రద్ధ చేయరాదని చెప్పారు. మొండి బకాయిల జాబితాను సిద్ధం చేసుకొని ప్రతి ఇంటికి, ప్రతి పరిశ్రమకు వెళ్లి బకాయిలను వసూలు చేయాలని వెల్లడించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. పిడుగురాళ్ల పట్టణంలో ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఆఫీసును ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాచర్ల డివిజనల్ ఇంజినీర్ నూతలపాటి సింగయ్య, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగం

క్రోసూరు: అనంతవరం గ్రామంలో తేళ్ళూరి ముసలా రెడ్డి వరి పొలంలో వ్యవసాయ శాఖ అధికారులు పంటకోత ప్రయోగాలను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి పాల్గొన్నారు. వరిలో 5 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పు గల విస్తీర్ణంలో ఉన్న వరి దుబ్బులను కోసి, నూర్పగా 13.5 కిలోల పచ్చి ధాన్యం దిగుబడి వచ్చిందని, ఇది ఎకరాకు 29 బస్తాలకు (75 కిలోలు)తో సమానమని తెలియజేశారు. పంట కోత ప్రయోగాల నిర్వహణ విషయంలో రైతు సేవ కేంద్ర సిబ్బంది అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, ఏమాత్రం అలసత్వం వహించినా దేశ ఉత్పత్తిలో దాని ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుందని, దిగుబడిని లెక్కించే విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుందని తెలిపారు.